# కూరమిరప (బెంగుళూరు మిర్చి)

కారంలేని ఈ కూర మిరప గంట ఆకారంలో లావుగా వుంటుంది. వీటిని పచ్చి కూరగాయలుగా ఉపయోగిస్తారు. దీని "సిమ్లామిర్చి" అని కూడా అంటారు. వీటిలో "ఎ" మరియు "సి" విటమిన్‌లు అధికంగా వున్నాయి.

**వాతావరణం :** శీతాకాలం రాత్రివేళల్లో అత్యల్ప ఉష్ణోగ్రత 10-17$^0$ సెల్సియస్ మధ్య 30-40 రోజులపాటు ఉంటే ఈ పంటకు అనుకూలం. రాత్రి ఉష్ణోగ్రత పెరిగే కొలది పూతరాలడం ఎక్కువవుతుంది. కాయ నాణ్యత తగ్గుతుంది.

**నేలలు :** నీరు బాగా ఇంకే బరువైన, సారవంతమైన నేలలు అనుకూలం. చవుడు నేలలు పనికిరావు.

**విత్తన మోతాదు, నారుమడి :** షుమారు 250 గ్రా. విత్తనాలను 25 చ.మీ. నారుమడిలో పలుచగా చల్లుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రా. చొప్పున థైరమ్ లేదా మాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలి. నారుమడిలో ఫ్యురడాన్ గుళికలు (100 గ్రా.) వేసుకోవాలి. విత్తిన 12 మరియు 19వ రోజున కాపర్ సంబంధిత శిలీంధ్ర నాశనులతో నేల తడిచేట్లుగా పిచికారి చేసి నారుకుళ్ళు తెగులును నివారించుకోవాలి.

**రకాలు**

**కాలిఫోర్నియా వండర్ :** కాయలు ఆకుపచ్చరంగులో ఉంటాయి. పంటకాలం 140-150 రోజులు. దిగుబడి ఎకరాకు 6-7 టన్నులు.

**అర్కబసంత్ :** కాయలు లేత పసుపు రంగులో ఉంటాయి. పంటకాలం 125-140 రోజులు. ఎకరాకు 6-8 టన్నుల దిగుబడినిస్తుంది.

**అర్కగౌరవ్ :** లేత కాయలు ముదురాకుపచ్చగా ఉండి, పూర్తిగా పెరిగిన దశలో నారింజ రంగుకు మారుతాయి. పంటకాలం : 125-150 రోజులు. దిగుబడి ఎకరాకు 6-8 టన్నులు.

**అర్కమోహిని :** కాయలు ముదురాకుపచ్చ రంగులో ఉంటాయి. కాయలు పండినప్పుడు ఎర్ర రంగుకు మారుతాయి. కాయలు చాలా పెద్దవిగా ఉంటాయి (కాయ బరువు 180-200 గ్రా.) పంటకాలం : 120 రోజులు. దిగుబడి 6-8 టన్నులు/హె. పై మూడు అర్క రకాలు ఖరీఫ్, రబీకు అనువైనవి.

**భారత్ (హైబ్రిడ్) :** కాయకలు ముదురాకు పచ్చగా ఉంటాయి. పంట దిగుబడి 14-16 టన్నులు/హె.

వివిధ కంపెనీలకు చెందిన పలు రకాల హైబ్రిడ్స్ మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. ప్రాంతాన్ననుసరించి రకాన్ని ఎన్నుకోవాలి.

**నాటే సమయం :** సెప్టెంబర్ నుండి అక్టోబర్ చివరి వరకు.

**నాటటం :** 35-40 రోజుల వయస్సుగల నారు వాడాలి. 60×45 సెం.మీ. దూరంలో కుదురుకు రెండు మొక్కల చొప్పున నాటుకోవాలి.

**ఎరువులు :** ఆఖరి దుక్కిలో ఎకరాకు 10 టన్నుల పశువుల ఎరువును వేయాలి. గొర్రెల పెంటతో పాటు వేపపిండి (2 క్వి/ఎకరా) వేస్తే మంచిది. నాటటానికి ముందు ఎకరాకు 24 కిలోల భాస్వరం, 12 కిలోల పొటాష్ వేసుకోవాలి. నాటిన 45 రోజుల తర్వాత 8 కిలోల నత్రజని, 4 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను మూడు దఫాలుగా 15 రోజుల వ్యవధితో వేసి నీరు పెట్టాలి. 1 శాతం యూరియా (లీటరు నీటికి 10 గ్రా.)ను కీటకనాశనులతో కలిపి పిచికారి

చేస్తే లాభదాయకం. జింకు లోప నివారణకు ఎకరాకు 20 కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. లేదా 2 గ్రా. జింకు సల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**కలుపు నివారణ, అంతరకృషి :** కలుపు నివారణకు పెండిమిథాలిన్ మందును ఎకరాకు 1.25 లీ. లేదా అలాక్లోర్ 1.0 లీ. (తేలిక నేలలు), 1.25 లీ. (బరువు నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 48 గంటలలోపు పిచికారీ చేయాలి. పూత నిలవటానికి, దిగుబడి పెరగటానికి నాఫ్తలీన్ అసిటిక్ ఆమ్లం, లేదా ట్రైకాంటనాల్ 20 మి.లీ. లీటరు నీటికి కలిపి పూత ప్రారంభ దశలో 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం :** నీరు ఎక్కువ పెట్టరాదు. అవసరాన్ని బట్టి నీటిని పెట్టాలి. సాధారణంగా ప్రతి 10-12 రోజులకు ఒకసారి నీటిని ఇవ్వాలి.

**సస్యరక్షణ :** మిరప పంటకు లాగే సస్యరక్షణ చర్యలను చేపట్టాలి.

**పంటకోత :** 135-150 రోజుల్లో ఎకరాకు 6-8 టన్నుల కాయల దిగుబడినిస్తుంది.

**మిరప మరియు బెంగుళూరు మిరపలో సమగ్ర సస్యరక్షణ :** పొలంలో కలుపు లేకుండా శుభ్రంగా వుంచాలి. అంతర పంటలుగా బంతి, ఉల్లి, వెల్లుల్లిలను వేయాలి. ఎత్తైన నారుమళ్ళు వేయాలి. రసంపీల్చు పురుగుల ఉ నికిని గమనించేందుకు ఎకరాకు 4 చొప్పున పసుపురంగు పూసిన రేకులకు ఆముదం/గ్రీసు పూసి పెట్టాలి. రసంపీల్చు పురుగుల నివారణకు అంతర్వాహిక కీటక నాశినులను పిచికారి చేయాలి. పై ముడత ఆశించినపుడు డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా మిథైల్ డెమిటాన్ 2.0 మి.లీ. లేదా ఫాసలోన్ 2.0 మి.లీ. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఎసిఫేట్ 1 గ్రా. ఒక లీటరు నీటికి చొ॥న కలిపి పిచికారి చేయాలి. క్రింది ముడత ఆశించినపుడు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా డైకోఫాల్ 5 మి.లీ. లేదా స్పైరోమెసిఫెరాన్ 3 మి.లీ. లేదా ప్రొపర్‌గైట్ 3 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ట్రైకోగ్రామా ఎకరాకు 20,000 చొప్పున విడుదల చేయాలి. అల్లికరెక్కల పురుగులను మొక్కకు 2 చొ॥న విడుదల చేయాలి. కిలో విత్తనానికి ట్రైకోడెర్మావిరిడి 4 గ్రా. చొప్పున కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఎకరాకు 100 కిలోల వేపపిండిలో ఒక కిలో ట్రైకోడెర్మా కల్చర్ కలిపి వేయాలి. ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకు మాంకోజెబ్ 2.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బాక్టీరియా ఎండుతెగులు ఉన్నచోట ఎకరాకు 6 కి॥ చొ॥న బ్లీచింగ్ పొడిని వేయాలి. కానోఫోరా ఎండుతెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రా. కలిపి పిచికారి చేయాలి. కొమ్మ ఎండుతెగులు నివారణకు కాప్టాన్ 2 గ్రా. లేదా ఇండోఫిల్ యం-45 2.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

కూరమిరప సాగుపై మరిన్ని వివరాలకు సంప్రదించాల్సిన చిరునామా **251వ** పేజీలో ఇవ్వబడింది.